# TELANGANA JOINT ACTION COMMITTEE (TJAC)

Second Floor, 21st Century Building, Opp: Intermediate Board,
Ek-Minar Road, Nampally, Hyderabad.

శ్రీయుత గౌరవనీయులైన
**ముఖ్య కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,**
సెక్రెటేరియేట్, హైదరాబాద్.

**ఆర్యా !**

**విషయము - తెలంగాణ రాష్ట్రము - జిల్లాల పురర్విభజన - పలు ప్రాంతాల ప్రజల డిమాండ్లు పరిష్కరించుటను గురించి**

**సూచిక - జిల్లాల పునర్విభజన చట్టం -1974 - తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నోటిఫికేషన్ - ప్రజాభిప్రాయసేకరణననుసరించి**

పై విషయమును పురస్కరించుకుని తమరితో మనవి చేయునది ఏమనగా తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనను అత్యంత వేగవంతంగా చేపట్టి అమలుపరిచిన సందర్భంగా 'టీజేయేసీ' తరపున మీకు, మీకు సహకరించిన అధికారుల బృందానికి మా హృదయపూర్వక అభినందనలు తెలియజేసుకుంటున్నాము. అధికార వికేంద్రీకరణలోనూ, ప్రభుత్వ పాలనాయంత్రాంగాన్ని ప్రజలకు మరింత చేరువచేయడంలోనూ, ప్రభుత్వం అమలుపరిచే సంక్షేమ పథకాలను సమర్థవంతంగా నిర్వహించడంలోనూ, పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచడంలోనూ జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ఉపకరిస్తుందని నమ్ముతున్నాము. అయితే జిల్లాల పునర్విభజన సందర్భంగా తలెత్తిన సమస్యలు, ప్రజలనుండి వ్యక్తమైన భిన్నమైన అభిప్రాయాలు, డిమాండ్లు పరిష్కరించడంలో ప్రభుత్వపరంగా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మేము భావిస్తున్నాము. ప్రభుత్వం నిర్వహించిన జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఇటీవల పలు ప్రాంతాలలో జరిగిన సంఘటనలు, పరిణామాలు తెలంగాణ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్న అంశాలను పరిష్కరించాలని కోరుతూ ఈ సందర్భంగా మీ దృష్టికి తీసుకువస్తున్నాము.

నల్గొండ జిల్లా 'గట్టుప్పల్' కేంద్రంగా కొత్త మండలాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ముందుగానే ప్రకటించింది. అందుకు అనుగుణంగానే సకల ఏర్పాటు పూర్తిచేసి అక్టోబర్ 11వ తేదీనాడు మండలకేంద్రంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ప్రారంభించేందుకు పూనుకున్నారు. చివరి నిమిషంలో స్థానిక ప్రజలకు ఎలాంటి సమాచారం అందివ్వకుండానే 'గట్టుప్పల్' మండల ఏర్పాటును రద్దుపరిచారు. ఇందుకు మనస్తాపం చెందిన ఏర్పుల యాదయ్య (28) అనే యువకుడు (గతంలో గ్రామసహాయకునిగా పనిచేసాడు) కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని, తీవ్రమైన కాలిన గాయాలతో గాంధీ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన బొడిగ సోని (19) అనే యువతికూడా మనస్తాపంతో ఒంటిపై కిరోసిన్ పోసుకుని 'ఆత్మహత్య'కు పాల్పడింది. 'గట్టుప్పల్' మండల ఏర్పాటు విషయంలో వీరిద్దరూ తమ ప్రాంత ప్రజల అభీష్టాన్ని వ్యక్తం చేసే క్రమంలోనే ఈ సంఘటనలకు పాల్పడ్డారు. ప్రజాభీష్టానికి ఆనుగుణంగా 'గట్టుప్పల్' మండల కేంద్రాన్ని ప్రారంభించవలసిన ప్రభుత్వం అక్కడ 144 సెక్షన్ విధించి, భారీ సాయుధ పోలీసు బలగాలను మోహరించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడంద్వారా ప్రజాభిప్రాయాన్ని అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నదనే ఆరోపణలున్నాయి.

నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 'నాగిరెడ్డిపేట' మండలంలోని గ్రామాలన్నీ భౌగోళిక పరిస్థితులరీత్యా మెదక్ జిల్లాకు అత్యంత సమీపంలో ఉన్నాయి. అనేక సంవత్సరాలుగా ఈ గ్రామాలలోని ప్రజలు తమ గ్రామాలను మెదక్ జిల్లాలో భాగం చేయాల్సిందిగా ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమ అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని 'నాగిరెడ్డిపేట' మండలాన్ని జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మెదక్ జిల్లాలో విలీనం చేస్తారనే ఎంతో ఆశతో ఎదురుచూసారు. కానీ ప్రజల అభీష్టానికి పూర్తిగా విరుద్ధంగా ఇప్పుడు 'నాగిరెడ్డిపేట' మండలాన్ని కొత్తగా ఏర్పాటు చేసిన 'కామారెడ్డి' జిల్లాలో భాగం చేసారు. ఈ మండలంలోని గ్రామాలకు 15 నుండి 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న మెదక్ జిల్లాలో విలీనం చేయకుండా, సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కామారెడ్డి జిల్లాలో కలపడంవల్ల నాగిరెడ్డిపేట ప్రజలు అనేక దూరభారాలను భరించవలసి వస్తుంది. ఈ పరిస్థితులతో మనస్తాపానికి గురైన నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన దళిత యువకుడు రాజు రాజధాని నగరం హైదరాబాద్ నడిబొడ్డులోని

‘ట్యాంకుబండ్’పై మూడురోజుల క్రితం ‘ఆత్మహత్య’కు బలయ్యాడు. ఈ నేపథ్యంలో ప్రజల నుండి వ్యక్తమవుతున్న నిరసనలు, ఆందోళనలను ప్రభుత్వం సాయుధ పోలీసు బలగాలతో అణచివేసేందుకు చేస్తున్న ప్రయత్నాలతో ఈ ప్రాంత ప్రజలు తీవ్రమైన భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లాలోని పదమూడు మండలాలను ఆ జిల్లా నుండి విడదీసి ఇతర జిల్లాలలో విలీనం చేస్తున్న విషయంలో స్థానిక ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోలేదనే విమర్శలున్నాయి. జిల్లాలో వెనుకబడిన ‘నారాయణపేట’ ప్రాంతాలను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలనే ప్రజల డిమాండును ప్రభుత్వం పట్టించుకోలేదనే ఆరోపణలుకూడా ఉన్నాయి. ‘నారాయణపేట’ జిల్లా ఏర్పాటు కోసం అక్కడి ప్రజల భాగస్వామ్యంతో చాలారోజులుగా జరుగుతున్న ఆందోళనలు, ప్రజలు వివిధ రూపాల్లో వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని కొడంగల్, దౌల్తాబాద్ మండలాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్న ‘వికారాబాద్’ జిల్లాలో విలీనం చేయడానికి ఈ రెండు మండలాలకు చెందిన అన్నిగ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గ్రామసభల తీర్మాణాలు లేకుండా, ప్రజల నుండి ఎలాంటి అభిప్రాయాలను సేకరించకుండా, ప్రభుత్వం ముందుగా ప్రకటించిన ‘డ్రాఫ్ట్ నోటిఫికేషన్’లో పొందుపరచకుండానే ఈ రెండు మండలాలను ప్రభుత్వం ఏకపక్షంగా మబబూబ్‌నగర్ జిల్లానుండి విడదీసి, వికారాబాద్ జిల్లాలో విలీనం చేసిందనే విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ కూడా ప్రజలనుండి వివిధ రూపాలలో వ్యక్తమవుతున్న ఆందోళనలు, నిరసనలను ప్రభుత్వం సాయుధ పోలీసు బలగాలతో అణచివేస్తున్నదనే ఆరోపణలున్నాయి. ప్రజలు వ్యక్తం చేస్తున్న డిమాండ్లను పరస్పరం చర్చల ద్వారా పరిష్కరించుకునే మార్గాలను అన్వేషించడం ద్వారా ప్రజాస్వామిక సాంప్రదాయాలను కొనసాగించడంతోపాటు, హింసను రూపుమాపేందుకు మార్గం సుగగమవుతుందని మేము భావిస్తున్నాము. ఈ దిశలో పరిష్కారాలకు మార్గాలను వెతికిఉంటే, ఇటీవలి ఆత్మహత్యలకు అవకాశాలు ఉండేవికావని మేము అభిప్రాయపడుతునాము.

ఇదే పద్ధతిలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో వివిధ ప్రాంతాల ప్రజలనుండి అనేక సూచనలు, ప్రతిపాదనలు, నిరసనలు, మార్పులు చేర్పులు వ్యక్తమవుతున్న విషయం మీకు తెలియందికాదు. తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు, పునర్నిర్మాణం విస్తృతప్రజాభిప్రాయానికి అనుగుణంగానే నిర్వహించాలని గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు పదేపదే చేసిన ప్రకటనల స్ఫూర్తితోనే ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారనే వాస్తవాన్ని గ్రహించాలని మీద్వారా ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము. విశాలప్రజానీకం వ్యక్తం చేస్తున్న విస్తృతాభిప్రాయాలను గౌరవించి జిల్లాల పునర్వ్యవస్థీకరణ, కొత్తజిల్లాల ఏర్పాటు, కూర్పులలో అవసరమైన మార్పులు, చేర్పులకుగల అవకాశాలను పరిశీలించాలని కోరుతున్నాము. అదేవిధంగా ఈ క్రింది అంశాలను తగు పరిష్కారం కోసం పరిశీలించాలని కూడా మీ ద్వారా ఈ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము.

1. రాష్ట్రంలో కొత్తజిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు, పునర్వ్యవస్థీకరణ విషయంలో ప్రజలనుండి వచ్చిన సూచనలు, మార్పులు, చేర్పులు, అభిప్రాయాలకు అనుగుణంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.
2. రాష్ట్రంలో కొత్తజిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన ఆందోళన విషయంలో పెట్టిన పోలీసు కేసులను పూర్తిగా ఎత్తివేయాలని కోరుతున్నాము. ఈ విషయంలో ఇప్పటికీ పలు ప్రాంతాలలో కొనసాగుతున్న ఆందోళనలను అణచివేసేందుకు సాయుధపోలీసు బలగాలను మోహరించడాన్నిబేషరతుగా ఉపసంహరించుకోవాలని కోరుతున్నాము.
3. కొత్త జిల్లాల ఏర్పాటు క్రమంలోనూ, తదనంతరము ప్రజల నుండి వస్తున్న సూచనలు, సలహాలను, ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి పరిష్కరించాలని కోరుతున్నాము.
4. రాష్ట్రంలో కొత్తజిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు నేపథ్యంలో ఆత్మహత్యలకు పాల్పడిన వారి కుటుంబాలను, వివిధ సంఘటనల్లో గాయపడిన బాధితులను ప్రభుత్వం అన్నిరకాలుగా ఆదుకోవాలని కోరుతున్నాము.

**తక్షణమే ఈ సమస్యలను పరిష్కరిస్తారని ఆశిస్తూ ...**

**కృతజ్ఞతలతో ...**

పిట్టల రవీందర్, ప్రొఫెసర్ యం. కోదండరామ్,

జి. వెంకట్‌రెడ్డి, ఇటిక్యాల పురుషోత్తం,

ఎస్. ప్రభాకర్‌రెడ్డి, బైరి రమేష్.